## కథ

‘వాడికి జొరం తగ్గిందేమో చూడు!’ మా అన్న అనే మాటలు లీలగా వినిపిస్తున్నాయ్. బిత్తరగా వదిన నుదుటి మీద చెయ్యి పెట్టి చూస్తోంది. పొద్దు పోయి మెల్లగాచీకటి పరుచుకోవడం నాకు తెలుస్తూనే వుంది. కళ్లు తెరుద్దామని ఎంతగా అనుకున్నా నా వల్ల కావట్లా. అంతా చీకటి. ఎక్కడో వున్నాన్నేను. అవును, ఎక్కడో వున్నా....

‘మా దేవుడు ఇట్టా వుంటాడు. మీ దేవుడు ఎట్టా వుంటాడు? ఎక్కడుంటాడు?’ ఎవరో గుచ్చి గుచ్చి అడుగుతున్నారు.

‘ఈ సాయిబులబ్బాయితో తిరగబాకరా అన్ని ఎన్ని మాట్లు చెప్పా లమిడికొడకా పా... ఇంటికి పా..’ ఎవరో తరుముకొస్తున్నారు.

# ఎర్రసున్నా

అంజద్



ఎందుకనో నన్ను వేరు చేసి మాట్లాడుతున్నారు. కాదు. వేరు చేసి చూస్తున్నారు.

చీకటి అలుముకుంటోంది. ఒళ్లు బాగా వేడెక్కింది. ఒంట్లో సెగలు, నాకెప్పుడూ ఇలా అవలేదు.

***

‘సరస్వతీ నమస్తుభ్యం వరదేకామరూపిణి’ భక్తితో కళ్లు మూసుకొని ప్రార్థన చేస్తున్నాను.

నేను కూడా ‘శివుడి రథం’లాగుతున్నా.అరుస్తున్నా... ‘హర హర మహాదేవ’!

రాముడి గుళ్లో గంట కొట్టి ప్రదక్షిణం చేస్తున్నా...

‘అంతలోనే కృష్ణాష్టమి వచ్చేసింది. వుట్టి కొట్టాలి ఎలాగా?’ హడావుడి పడుతున్నా...

మనసంతా ఏదోలాగుంది. జ్ఞాపకాలు మంచివి, చెడ్డవి వెంటాడుతున్నాయి. తలంతా నొప్పిగా వుంది.!

‘అదేంటి?నాకి, మీకి అనకుండా తెలుగింత బాగా మాట్లాడుతున్నావ్?’ నిజంగా నువ్వు ముస్లిమేనా? నిలదీస్తున్నారు నన్ను.

‘అదిగో ఆ వీధిలో నీసు వాసన వస్తుందే అదే వాళ్లిల్లు’ వేలెత్తి చూపిస్తున్నారెవరో!

‘నువ్వెన్నన్నా చెప్పు. మీ పద్ధతులు వేరు. మా పద్ధతులు వేరు వాదించబాక. తెగేసి చెపుతున్నా పెద్ద మనిషి కనిపిస్తున్నాడు. చాలా బాధగా వుంది. ఏదో చెప్పాలని వుంది. శక్తినంత కూడగట్టుకుంటున్నా. నోరు రావట్లా.

అంతా చీకటి! ఎక్కడో ఉన్నాన్నేను!

ఆ మనిషిని చూడ్డం అదే మొదటిసారి. పెద్దాయన తెల్లటి గడ్డం, మెరిసే కళ్లు, మడమ మీద చారల లుంగీ, నెత్తి మీద టోపితో పవిత్రంగా వున్నాడు. చూడగానే మనసులో గౌరవం. వెళ్లి ఏదైనా మాట్లాడాలని వుంది. ఏం మాట్లాడను?...నాకక్కడ కొత్త.

‘మేరేకో చాచా...మేరేకో’ అంటూ పిల్లలంతా ఆయన చుట్టూ చేరి అల్లరి చేస్తున్నారు.

‘జరూర్ బేటా’ ఓపిగ్గా అందరికి కళ్లకు సుర్మా అద్దుతున్నాడు. మసీదు మెట్ల మీద కూర్చుని అత్తర్లు, టోపీలు అమ్ముకునే ఆ పెద్దాయనకు ఇదీ ఒక దిన చర్య. రోజూ ఐదుపూటలా నమాజు కొచ్చే పిల్లలు, యువకులు, పెద్దలు అందరికీ ఎన్నో ఏళ్లుగా సుర్మా పెడుతుంటాడు.

అలవాటైన ఆ చేయి కళ్లకు సుర్మా అద్దుతుంటే నాకు ఒక మహాకళాకారుడు ఆయనలో కనిపించసాగాడు. మొదటి సూర్మా రాయిని పగులకొట్టి, వస్త్రంతో జల్లెడ పట్టి ఆ మెత్తటి సుర్మాను గాజుసీసాలో వేసుకుంటున్నాడు. కంటి కింద రెప్పను ఎడమ చేతి బొటనవేలితో తెరచి, తల కదల్చకుండా పట్టుకుని, కుడి చేత్తో సన్నటి దూదిపుల్లతో ‘సుర్మా’ తీసుకొని సర్రున ఆయన గీసే గీత క్షణాల్లో అందాన్ని మోసుకొస్తుంది.

‘మాసా అల్లాహ్’ సుర్మా అద్దిన ప్రతీసారి ఆయన అనే మాట. ‘మాషా అల్లాహ్’ స్పష్టంగా వినిపిస్తుంది నాకు. గాఢమైన చీకటిలో కూడా ఆ ముఖం కళ్లకుకట్టినట్లు కనిపిస్తుంది. ఇక ఆలోచనలు ఎటూ పోవడం లేదు. ఆయన చుట్టే తిరుగుతున్నాయి.

***

అప్పుడే ఆజాన్ ఇస్తున్నారు, అందరూ నమాజ్‌కి వస్తున్నారు. ‘కల్ తుమ్ నమాజ్ కేలియే క్యూం నా ఆయ్?’ నన్నే అడుగుతున్నట్లు అనిపించింది. ‘అల్లాహ్ సే డరో బేటా!’ ఆ మాటలు నా వెన్నులో చలి పుట్టించాయి. సొంత మనిషిలా పేరు పేరునా అందర్నీ పలకరిస్తున్నాడు. సలాములు చేస్తూ మసీదులోకి ఆహ్వానిస్తున్నాడు. ధైర్యం చేశా. నాలుగడుగులు వేసి ఆయన పక్కనే కూర్చున్నా.‘సుర్మా పెట్టించుకుంటావా?’ సైగా చేశాడు. అంతకన్నానా? మొదట మంట. తర్వాత మంచు... భలే హాయిగా అనిపించింది.

***

ఇప్పుడు కష్టంగా వుంది. పక్కమీద అటూ ఇటూ పొర్లాడతానే ఉన్నా.... ఒళ్లంతా వేడిగా ఉంది. గొంతు తడారిపోతోంది. కలవరింత అంతా ఆయన గురించే.

***

‘ఎన్నాళ్ల నుండి ఇక్కడ వుంటున్నారు?’ మాటల్లో పెట్టా ఆయన్ని. ‘ ఇదా ఇలాఖాలో పుట్టా. ఇక్కడే పెరిగా. ఇదిగో ఈ పనే చేస్తావున్నా. అల్లా రాసిన నసీబ్‌ని కాదనగలమా?’ తృప్తి పడ్డాడు.

‘మీది ఆంధ్రానా?’ అడిగాడు.

నా మాట తీరుని బట్టి అడిగాడన్న సంగతి అర్థమై నవ్వుతూ ‘అవునన్నా’. ఇంకొంత సేపు అలా మాట్లాడుకున్నాం. ఎందుకో తెలీదు. ఒకలాంటి ప్రేమ కలిగింది ఆయన మీద.

‘ఈ యేడు మా అమ్మాయికి నికా జరిపించాలి... ఇన్షాఅల్లహ్!’

‘జుహల్ నమాజ్ టైం అయ్యింది పదపద’ అంటూ లేచి నిల్చున్నాడు. ఆయనతో పాటు వచ్చీ రాని, ‘వుజూ’కు నేనూ కూర్చున్నా. అతనెలా చేస్తే అలానే చేస్తున్నా...సరిగా చేస్తున్నానో లేదోనని భయం. అప్పటికీ, నా పద్ధతిలో నేను ‘ ఈ చేతుల్తో, ఈ కాళ్లతో, ఈ నోటితో నేను చేసిన తప్పుల్ని మన్నించు యా అల్లా’ అని మనసులో అనుకుంటూ హౌజ్ నీళ్లలో నా ముఖం చూసుకున్నా. సరిగా కనిపించడం లేదు. నీటి పొరల్లో చెదిరిపోయిన నా రూపాన్ని వెతుక్కుంటున్నాను.

***

‘ఇదిగో దొరికాడమ్మా నీ కొడుకా...’ ఉరుసు రోజు తప్పిపోయిన నన్ను ఎత్తుకుని వచ్చి మా అమ్మకు అప్పగిస్తున్న నారాయణయ్య నిలబడి వున్నాడు.

‘భాయ్.... ఈ డబ్బులుంచు. ఇంటి పని పూర్తి బై... ఆపబాకో’ మా నాన్న భుజం తడుతున్న ప్రసాదన్న కనిపిస్తున్నాడు.

‘రాయ్యా... అన్నం తిను. నువ్వొకటి. మా వాడొకటా?’ చంద్రా వాళ్లమ్మ చేతిలో కంచం పట్టుకొని పిలుస్తోంది.

ఆకలిగా వున్నాను. కడపారా తినాలని వుంది. లేచి వెళ్లలేక పోతున్నా. కళ్లు తిరుగుతున్నాయ్. అంతా చీకటిగా వుంది. ఎక్కడో ఉన్నాన్నేను.

***

‘రెండ్రోజులైంది. ఏమీ తినలేదు. ఇలా ఐతే ఎలా? లే... లేచి కాస్త పాలన్నా తాగు. మళ్లీ మా అన్నే నా గురించే ఆ కంగారంతా.... నేనేమైపోతానోనని భయం.

‘ఎట్లా చేద్దామయ్యా...?’ మా వదిన అమ్మలా మారిపోయింది. నా వైపే చూస్తున్న ఆ కళ్లల్లో నుంచి కన్నీళ్లు ఉబికి వస్తున్నాయ్. అలానే కూర్చుంది.

***

‘అందరూ లేచి నిలబడండి...’ ‘సఫ్...సహీ కరో’...‘భుజానికి భుజం ఆనించాలి’...

జమాఅత్ తో ఇమాం అంటున్నాడు. పరుగు పరుగున తడిగా వున్న చేతుల్ని, ముఖాన్ని టోపితో తుడుచుకుని నిలబడ్డాం.నేనొక సఫ్‌లో ఆయనొక సఫ్‌లో, నమాజ్ మొదలైంది. ‘అల్లాహు అక్బర్’ అని నియ్యత్ కట్టుకున్నాను.

***

‘బొట్టు పెట్టుకుంటే అచ్చు హిందువులబ్బాయ్ లాగున్నావ్ నాయనా’మా తెలుగు టీచరు దీవిస్తోంది.

‘రంజాన్ ముబారక్ రా..’ అంటూ భాస్కర్ నన్ను గుండెలకు హత్తుకుంటున్నాడు.

‘నేనూ మొయొచ్చా?’ అంటూ వచ్చి నాతో పాటు మా నాన్న జనాజాని మోస్తున్న శీనుగాడి భుజాలు కనిపిస్తున్నాయి.

ఇప్పుడంతా సరిగ్గా కనిపిస్తోంది. అందరూ నా చుట్టూ చేరారు. నన్నుకాదన్న వాళ్లు. నన్ను ఔనన్న వాళ్లు అందరూ...

నన్నే చూస్తున్నారు. ప్రతి ముఖంలో ఒక అద్దం.

జ్వరం కాసింది నాక్కాదని కనబడుతోంది.

***

మళ్లీ అల్లాహు అక్బర్’ అంటూ సజ్దాలోకి వెళ్లాను.

నుదురు ఏకలు ఆనింది ప్రార్థిస్తున్నా.. అంతటా నిశ్శబ్దం. మనసేదో చేదుని పసిగడుతోంది.... తల కుడి వైపునకు తిప్పి ‘ ఆస్సలామాలూకుమ్ వ రహమతుల్లా’ అనసలామ్ చేశాను. అలాగే ఎడమ వైపుకి తిరగబోతుండగా.....

అంతా చీకటి మయం. టోపీలన్నీ ఎగిరిపడ్డాయి. దువా చేస్తున్న చేతులు తెగిపడ్డాయి. తెల్లటి పావురాళ్లు కనిపించకుండా ఎగిరిపోయాయి.

ఎక్కడున్నాను నేను. ఒక్కసారిగా నన్ను నేను వెదుక్కున్నాను.

నేలకొరిగిన దేహాలు ఇమామ్ చెప్పినట్లుగానే భుజానికి భుజం ఆనుకుని పడి వున్నాయి. సరిగ్గా చూస్తే వారిలో ఆయనొకడు!

నల్లటి సుర్మా ఎర్రబడింది.

‘ఇంతకీ ఆయన పేరేమిటో?!’ అడగనేలేదు నేను.

***

‘లేరా...లే...పైకి లేచి కళ్లు తెరువు’ బాధను గొంతులో దాచుకుని లేపుతున్నాడు మా అన్న.

ఇప్పుడల్లా కళ్లు తెరుచుకునేలా లేవు.

జ్వరం తగ్గేలా లేదు.

ఈ జ్వరం ఇంకెంత మందికి కాస్తుందో!?’

★

